సాక్షి జగిత్యాల

గురువారం, 14, సెప్టెంబర్, 2023



అంజన్న సేవలో ఎమ్మెల్సీ కవిత

కొండగట్టు: కొండగట్టు అంజన్నను బుధవారం ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. గండదీపం వద్ద దీపాలు వెలిగించారు. ఎమ్మెల్యే రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులున్నారు.



నిధులు లేకుండానే ఎస్‌జీఎఫ్..

స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం

28.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతుబీమా చిక్కులకు చెక్

• బీమా సమస్యలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొత్త రైతులకు బీమా చిక్కులకు చెక్ పడింది. బీమా పత్రాల జారీ సమస్యలపై కలెక్టర్ డా.బి.గోపి సమగ్రంగా ఆరా తీశారు. కొత్త రైతులకు బీమా పత్రాలు రాకపోవడమేంటని వ్యవసాయశాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా భూములను కొనుగోలు చేసిన కర్షకులకు బీమా పత్రాలు రాకపోవడంపై ఈ నెల 9న 'కొత్త రైతులకు బీమా చిక్కులు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్త రైతులకు బీమా పత్రాలను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. బీమా క్లెయిమ్ సెటిల్‌మెంట్, రైతు కుటుంబాల పత్రాలను సైట్‌లో పొందుపర్చడం, ఎల్‌ఐసీ ఐడీల విషయంలో ఎప్పటికప్పుడు పరిష్కారం ఉండాలని జిల్లా వ్యవసాయశాఖను ఆదేశించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాలరూరల్: ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 13,968 క్యూసెక్కుల నీరు వస్తోంది. అదేస్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కొనసాగుతుంది.

గణేశ్ మండప నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: గణేశ్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని, భద్రత, బందోబస్తు కోసమే ఆన్‌లైన్‌లో అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండపం నిర్వహణ, సంబంధిత సమాచారం కోసం పోలీస్‌శాఖ ఆన్‌లైన్ పోర్టల్ రూపొందించిందన్నారు. ఈ సమాచారం ద్వారా భద్రత బందోబస్తు ఏర్పాటుకు పోలీసులకు సులువుగా ఉంటుందని పేర్కొన్నారు.నిర్వాహకులు గణేశ్ విగ్రహాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ముందస్తు సమాచారం పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని, అందుకోసం ఏదైనా కంప్యూటర్ మొబైల్‌లో అప్లై చేసుకోవాలన్నారు. http// poli ceportal. tspolice. gov. in వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకుని అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందించా లని కోరారు. ఎవరికైనా ఎలాంటి సందేహాలున్నా సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పండుగను అందరూ శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థి సమంత్ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచూపి కాంస్య పతకం సాధించాడు. సమంత్‌ను ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినీత్‌కుమార్ అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల దీక్ష



దీక్షలో విద్యుత్ ఉద్యోగులు

జగిత్యాలరూరల్: తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ టీఎస్ (యూఈఈయూ) సీఐటీయూ రాష్ట్ర పిలుపు మేరకు రెండో రోజు బుధవారం జగిత్యాల సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నాయకులు ఆంజనేయులు, దమ్మ రవీందర్‌రెడ్డి, రమణ, ఆంజనేయులు, కొమురయ్య, రాజేశ్, సుధాకర్, శ్రీధర్, రమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





హిస్టాలజీ ల్యాబ్



తరగతి గది

కన్నారం మెడికోల హబ్

సిరిసిల్ల, కరీంనగర్‌లో మెడికల్ కాలేజీలు రెడీ

వైద్యరంగం అభ్యున్నతిలో భాగంగా మెడికల్ కాలేజీల స్థాపనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల అనుమతులు సాధించిన తొమ్మిది మెడికల్ కాలేజీలను ఒకేసారి శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన సిరిసిల్ల, కరీంనగర్ వైద్యకళాశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇటీవల కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలవడం తెలిసిందే. అదే సమయంలో ఈ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఊపందుకుంది. ఈ కాలేజీల రాకతో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య నాలుగుకు చేరుకోగా, ప్రైవేటుతో కలుపుకుంటే వీటి సంఖ్య ఆరుకు చేరుకోవడం గమనార్హం. మొత్తం కాలేజీల్లో అన్ని కలిపి 950 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

- రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ఉమ్మడి జిల్లాలో ఆరుకు చేరనున్న మెడికల్ కాలేజీల సంఖ్య
- సర్కారు కాలేజీల్లో ఏటా 500 మందికి అడ్మిషన్లు
- ప్రైవేటు కలిపితే అందుబాటులో దాదాపు 950 సీట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

2000 సంవత్సరం కరీంనగర్‌లో ఒక్క వైద్య కళాశాల కూడా లేదు. 2003 తర్వాత రెండు ప్రైవేటు కాలేజీలు మాత్రం వచ్చాయి. రెండేళ్ల క్రితం జగిత్యాల, రామగుండం కాలేజీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం రెండు కాలేజీల్లో రెండో సంవత్సరం తరగతులు కూడా విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ రెండు కాలేజీల భవనాల నిర్మాణం కూడా అదేస్థాయిలో ఉంది. ఇక రామగుండం మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు రూ.510 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఖర్చును భరించేందుకు సింగరేణి ముందుకువచ్చింది. దీంతో ఆ కాలేజీ పేరును సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చారు. మొత్తం 150 సీట్లలో 24 సీట్లు ఆలిండియా రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారు. మిగిలిన 126 సీట్లలో 5శాతం సింగరేణి కార్మికుల పిల్లలకు రిజర్వేషన్ కింద అందజేస్తారు. 7 సీట్లు రాష్ట్రంలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్ పద్ధతిన కేటాయించనున్నారు. దీంతోపాటు జగిత్యాల మెడికల్ కాలేజీలో 150 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కాలేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.510 కోట్లు కేటాయించింది. 27.5 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కాలేజీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నడుస్తున్నాయి.

ఇటీవలే టెండర్లు

ఇక ఈ ఏడాదే అనుమతి వచ్చిన కరీంనగర్, సిరిసిల్ల కాలేజీల భవనాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో కరీంనగర్ రూ.104.5 కోట్లు, రూ.107.3 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. 15 నెలల్లో ఈ భవనాలను నిర్మించాలని టెండరు నోటీసులో పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కాలేజీల పరంగా చూసుకుంటే మొత్తం 600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి ప్రైవేటు కాలేజీలైన చలిమెడ 250 సీట్లు, ప్రతిమ 200 సీట్లు కూడా కలుపుకుంటే మొత్తం 950 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక్క కరీంనగర్‌లోనే 550 మెడికల్ సీట్లు వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండటం విశేషం.



ప్రారంభానికి సిద్ధమైన ప్రభుత్వ మెడికల్ కళాశాల

కాలేజీ	సీట్లు	పడకలు
సిరిసిల్ల	100	300
కరీంనగర్	100	500
రామగుండం	150	330
జగిత్యాల	150	330
ప్రైవేటు	450సీట్లు	

1,460 పడకలు అందుబాటులోకి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్కారు మెడికల్ కాలేజీ వల్ల సామాన్యులకు వైద్యం అందుబాటులోకి రానుంది. కరీంనగర్ 500, రామగుండం 330, సిరిసిల్ల 300, జగిత్యాల 330 పడకలు ఆయా కళాశాలల్లో అందుబాటులోకి వచ్చాయి. కరోనా లాంటి విపత్తులు సంభవించినపుడు ప్రజలకు అన్ని రకాల వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంటాయని వైద్యనిపుణులు భరోసా ఇస్తున్నారు.

సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు



పేదలకు సేవలు అందించాలన్న కృతనిశ్చయంతో అన్ని జిల్లాలో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తోన్న వైద్యకళాశాలలు రాష్ట్ర ప్రతిష్టను పెంచుతాయి. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు. ఇప్పటికే మెడికల్ హబ్‌గా ఉన్న రాష్ట్రం ముమ్ముందు రోజుల్లో మెడికోలకూ హబ్‌గా మారనుంది.

– డా.బీఎన్ రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

దేశానికి అన్నం, వైద్యం



ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఎదిగి, దేశానికి అన్నం పెడతాం. సీఎం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల ఇది సాధ్యమైంది. ఆయన అదే ముందుచూపుతో రాష్ట్రంలో పేదలకు, సామాన్యులకు వైద్య సేవలు అందాలన్న సంకల్పంతో ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ అన్న సాహోసోపేతమైన నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో తయారైన వైద్యులు దేశానికి వైద్యం చేస్తారు.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి

రాచరిక పాలనకు చరమగీతం పాడాలి

• మాజీ ఎమ్మెల్సీ జోషి




మాట్లాడుతున్న జోషి

ధర్మపురి: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ల రాచరిక పాలనకు చరమగీతం పాడాలని పెద్దపెల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ జోషి పిలుపునిచ్చారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న సోనియాగాంధీ విజయభేరి సభ నేపథ్యంలో బుధవారం స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విజయభేరి సభ విజయవంతం పట్ల కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలో దించారని, వీటితో ప్రజలపై భారం పడుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక నిరుద్యోగ, రైతు, నీటి సమస్యలు తీరలేదని, ఒక్క లిక్కర్ షాపులో తప్పా ఏ రంగం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, అందుకు సోనియా తలపెట్టనున్న విజయభేరి సభను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు గజ్జెల స్వామి, మద్దెల రవీందర్, వివిధ మండలాల అధ్యక్షులు దినేష్, ఆవుల శ్రీనివాస్, బుర్ర రాములు, పీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు శ్రీకాంత్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, కుంట సుధాకర్ తదితరులున్నారు.

ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• కలెక్టర్ యాస్మిన్‌బాషా



కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్

జగిత్యాల: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం వర్చువల్ విధానం ద్వారా ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తుందని, అందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆరోగ్య మహిళ కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. వైద్య, ఆరోగ్యం అంశంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేలా చూస్తున్నామన్నారు. అనంతరం అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు భోజనకిట్లను పంపిణీ చేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్, అజయ్‌రెడ్డిలను కలెక్టర్ సత్కరించారు. అదనపు కలెక్టర్ లత, డీఎంహెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం మెడికల్, నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వైద్య విద్యాభ్యాసానికి వచ్చిన 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ లత, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో దీప్తి హత్య నిందితులు

కోరుట్ల: కోరుట్లకు చెందిన బంక దీప్తి హత్య కేసులో నిందితులైన చెల్లెలు బంక చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ ఉమర్ సుల్తానా, అతడి తల్లి ఆలియా, చెల్లి పాతిమాలను పోలీసులు మంగళవారం కస్టడీకి తీసుకున్నారు. వీరిని మళ్లీ బుధవారం హైదరాబాద్‌కు తీసుకెళ్లి దీప్తి హత్య అనంతరం ఎక్కడెక్కడ తలదాచుకున్నారు, ఉమర్ తల్లిదండ్రుల పాత్ర ఏమిటి..? బంక దీప్తి ఇంట్లో నుంచి ఎత్తుకెళ్లిన ఆభరణాలు ఇంకా ఏమైనా దాచిపెట్టారా..? అన్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. గురువారం దీప్తి హత్య కేసు నిందితుల పోలీసు కస్టడీ ముగుస్తుందని తెలిసింది.

ఇక్కడి నుంచే జైత్రయాత్ర ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు

- సంజయ్‌కుమార్ గెలుపుతో చరిత్ర సృష్టించాం
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల: సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో జగిత్యాల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జిల్లాగా ఏర్పాటు కావడంతో పాటు ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను గెలిపించుకుని చరిత్ర సృష్టించామని, మళ్లీ ఇక్కడి నుంచే జైత్రయాత్ర ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల మామిడి మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడబిడ్డలు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే జగిత్యాలలో గులాబీ అత్యధిక మెజార్టీతో గుబాలిస్తుందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా జిల్లాను అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. 63 వేల మందికి పెన్షన్లు, 25 వేల మందికి బీడీ పింఛన్లు, వికలాంగులకు రూ.4వేల పింఛన్ ఇవ్వడం జరుగుతుందని, ఇక్కడి నాయకుడు జీవన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛన్ ఇస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు.

సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారు

జగిత్యాల ప్రజలు జీవన్‌రెడ్డికి ఎన్నో అవకాశాలు ఇచ్చారని కానీ వారి మరదలిని మున్సిపల్ చైర్‌పర్సన్ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ వచ్చాక పద్మశాలీలకు చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. జీవన్‌రెడ్డికి చాలెంజ్ చేస్తున్నామని తన రాజకీయ చరిత్రలో జగిత్యాల అభివృద్ధికి ఎన్ని కోట్లు తెచ్చారో చెప్పాలన్నారు. ఆయన మాటమీద నిలబడే మనిషి కాదని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనం సభ మహాసభలా ఉందని, సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. నియోజకవర్గంలోని అల్లీపూర్, ఒడ్డెలింగాపూర్‌ను మండలాలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. రూ.510 కోట్లతో జిల్లా కేంద్రంలో వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎక్కడ చూసినా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే..

మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, ఆత్మీయ సమ్మేళనానికి జనం తరలివచ్చారని ఎక్కడ చూసినా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కన్పిస్తుందన్నారు. 65 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని పనులను కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపారన్నారు. గతంలో కవితను ఓడగొట్టుకుని పార్లమెంట్ లాస్ అయ్యామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మంచి మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల గతంలో కంటే 100 రెట్లు అభివృద్ధి చెందిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, సీఎం కేసీఆర్ నిధులు కేటాయించడంతో ఎంతో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని, మూడోసారి గెలిచి చరిత్ర సృష్టిద్దామన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, మరోసారి అధికారంలోకి వస్తున్నామని, మరింత అభివృద్ధి పథంలో జిల్లా ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సమ్మేళనంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేశంగౌడ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో నాయకులు, కార్యకర్తలు

తరలివచ్చిన జనం

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి జనం భారీగా తరలివచ్చారు. డీఎస్పీ వెంకట స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన సభ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ల సమక్షంలో పార్టీలో చేరారు.

గొర్రెపిల్ల బహూకరణ

ఆత్మీయ సమ్మేళనంలో జగిత్యాలకు చెందిన కుర్మ సంఘం నాయకులు ఎమ్మెల్సీ కవితకు గొర్రెపిల్లను బహూకరించారు. కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు వొల్లం మల్లేశం, మొగుళ్ల గంగమల్లయ్య, గట్టయ్య, రమేశ్, పోచమల్లయ్య పాల్గొన్నారు. అలాగే జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంజయ్‌కుమార్‌ను ప్రకటించగా, ఆత్మీయ సమ్మేళనంలో రాయికల్ ఎంపీపీ లావ్యణ్య సంధ్యారాణి నామినేషన్ ఖర్చులకు రూ.5 వేల విరాళం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, వంగ రాజేశం పాల్గొన్నారు.

రేపు 'టెట్'

- జిల్లా కేంద్రంలోనే సెంటర్లు
- హాజరుకానున్న 11,342 మంది అభ్యర్థులు
- ఉదయం 25.. మధ్యాహ్నం 24 కేంద్రాల్లో పరీక్షలు



కథలాపూర్(వేములవాడ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15న నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసి వాటిలో వసతులు సమకూర్చారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఇన్విజిలేటర్లు, హాల్ సూపరింటెండెంట్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఎంపిక చేసి వారికి డ్యూటీ ఆర్డర్లు జారీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారుల సహకారం తీసుకుంటున్నామని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

పేపర్–1కు 5,973..

పేపర్–2కు 5,369 మంది..

టెట్‌కు జిల్లాలో 11,342 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 15న పేపర్–1 పరీక్షను ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు నిర్వహించనుండగా 5,973 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరికి జగిత్యాల పట్టణంలోనే 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పేపర్–2 పరీక్షను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనుండగా 5,369 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరికి జగిత్యాల పట్టణంలోనే 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొన్నారు.

ఇన్విజిలేటర్లుగా విద్యాశాఖేతర అధికారులు

15న టెట్ నిర్వహించనుండటంతో ఇన్విజిలేటర్లుగా విద్యాశాఖేతర అధికారులకు డ్యూటీలు కేటాయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పరీక్షలకు 300 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాలకు 25 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 25 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 125 మంది హాల్ సూపరింటెండెంట్‌లను నియమించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి


చిన్న గంగాధర్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన రైతు దొనికెన చిన్న గంగాధర్(54) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాలు.. మొక్కజొన్న పంట రక్షణకు వెళ్లిన గంగాధర్ చేనులోనే కుప్పకూలి మృతిచెందగా సమీపంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్వగ్రామానికి మృతదేహం


హమీద్‌ఖాన్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణానికి చెందిన హమీద్‌ఖాన్ మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. ఇటీవల కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హమీద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి మృతదేహం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై మూడు చక్రాల వాహనంపై వెళ్తున్న వ్యక్తులను అజాగ్రత్తగా ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల లింగవ్వ తన కొడుకు మ్యాకల మల్లేశం పని నిమిత్తం తిమ్మాపూర్ నుంచి జగిత్యాలకు మూడుచక్రాల వాహనంపై వస్తుండగా కల్లెడ శివారులో అదే గ్రామానికి చెందిన గొడుగు రాజన్న ద్విచక్రవాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి మూడుచక్రాల వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో మల్లేశం కుడికాలుకు, తలకు బలమైన గాయాలయ్యాయి. లింగవ్వకు కుడికాలుపై బలమైన రక్తగాయాలయ్యాయి. లింగవ్వ ఫిర్యాదు మేరకు గొడుగు రాజన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీజిల్ చోరీ కేసులో ముమ్మరంగా దర్యాప్తు

మల్యాల(చొప్పదండి): మండలంలోని రాజారం శివారులోని పెట్రోల్ బంక్ నుంచి సోమవారం అర్ధరాత్రి సుమారు రూ.2లక్షల విలువైన 2వేల లీటర్ల చోరీ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. మల్యాల అడ్డరోడ్డు, పెట్రోల్ బంక్ సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆటోలో వచ్చి పెట్రోల్ బంక్ వెనక భాగం పైపును పెట్రోల్ పంప్‌లోని ట్యాంకర్‌కు బిగించి, నీటిని తోడే మోటారుతో ఆటోలోని డ్రమ్ముల్లో నింపుకుని వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పెట్రోల్ బంక్ ట్యాంకర్‌లో 2వేల లీటర్లు తక్కువగా ఉండడంతో అనుమానం వచ్చి, వెనకభాగంలో పరిశీలించడంతో డీజిల్ ఆనవాళ్లతోపాటు నాలుగు చక్రాల వాహనం వచ్చినట్లు గుర్తించి, బంక్ నిర్వాహకుడు సాగర్‌రావు పోలీసులతోపాటు ఐఓసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాలతోపాటు సాంకేతిక విజ్ఞానం సాయంతో కేసు ఛేదించేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు.

భూమి కోసం ఆందోళన

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట కాలనీలో భూమి ఇప్పించాలని కోరుతూ రాత్రి 8 గంటలకు ఓ కుటుంబం ఆందోళనకు దిగింది. కాలనీలో ఓ గుడిసెలో ఉండే బండి నర్సయ్య ఆయన భార్య పోషవ్వ, కుమారుడు నవీన్ కలిసి వేములవాడ వెళ్లే రోడ్డుపై కూర్చుని ఆందోళన చేశారు. మాజీ కౌన్సిలర్ తమ భూమిని ఆక్రమించాడని ఆరోపించారు. అనంతరం ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట మోసం

కరీంనగర్‌క్రైం: ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో మోసం చేసిన వారిపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కట్టరాంపూర్‌కు చెందిన అనిల్ ప్రైవేటు ఉద్యోగి. గతనెలలో అతనికి ఓ వాట్సాప్ గ్రూపులో యూట్యూబ్ చానల్ ద్వారా ఇంటి వద్దనే ఉద్యోగం చేస్తూ డబ్బులు సంపాదించొచ్చని ఒక మెసేజ్ వచ్చింది. స్పందించిన అతనికి కొంత మొత్తం సొమ్ము వచ్చింది. తర్వాత పెట్టుబడి పెడితే మంచి లాభాలుంటాయని మెగాప్రో డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు వివిధ రకాల విషయాలు చెప్పి ఆకర్షించారు. పలు దఫాలుగా అనిల్ వద్ద నుండి రూ.లక్షల్లో వసూలు చేశారు. మరోసారి అతను రూ.31 లక్షలు గెలిచినట్లు నమ్మబలికారు. ఈ డబ్బులు తీసుకోవాలంటే రూ.5లక్షలు చెల్లించాలని సూచించడంతో మోసపోయానని గ్రహించిన అనిల్ సైబర్‌క్రైం విభాగానికి ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నిధులు లేకుండానే ఎస్‌జీఎఫ్ క్రీడలు


ఖోఖోలో తలపడుతున్న విద్యార్థులు


ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న పెగ్గెర్ల పాఠశాల క్రీడాకారులు

- ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకున్న విద్యార్థులు
- క్రీడలకు ప్రోత్సాహం కరువయిందంటున్న క్రీడాకారులు

కథలాపూర్(వేములవాడ): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని పాలకులు, అధికారులు ప్రసంగాల్లో అదరకొడుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం విభిన్నంగా ఉందని పలువురు క్రీడాకారులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడలు కథలాపూర్‌లో బుధవారం ప్రారంభం కాగా.. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులపాలయ్యారు.

విద్యార్థులపైనే భోజనం, రవాణా చార్జీల భారం

కథలాపూర్‌లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడలకు మండలంలోని 19 గ్రామాలకు చెందిన అండర్–14, అండర్–17 విభాగాల విద్యార్థులు హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ క్రీడలకు కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ వేదికగా మారింది. ఎస్‌జీఎఫ్ క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో అధికారులు వసతుల కల్పనపై దృష్టిసారించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చి క్రీడల్లో పాల్గొనే పలువురు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్నారు. పలువురు మధ్యాహ్నం భోజనం తినకుండా పస్తులుండి అలసటతోనే క్రీడల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా గ్రామాల నుంచి కథలాపూర్‌కు వచ్చిన విద్యార్థులు సొంతంగా ఆటో, బస్సు చార్జీలు వెచ్చించినట్లు పలువురు పేర్కొన్నారు. విద్యార్థులపై భారం మోపడం దారుణమని పలువురు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు వెళ్లాల్సి ఉంటుంది. సొంత ఖర్చులతో వెళ్లడానికి విద్యార్థులు విముఖత చూపిస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు కనీసం బహుమతులు ఇచ్చి ప్రోత్సహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ క్రీడలకు నిధులు కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వివక్ష సరికాదు



ఎస్‌జీఎఫ్ క్రీడలు ఆర్భాటంగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం చెప్తుండగా, నిధులు కేటాయించకపోవడం సరికాదు. ప్రభుత్వం క్రీడాకారుల పట్ల వివక్ష చూపిస్తుంది. క్రీడలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.
– బండి భాస్కర్, సీనియర్ క్రీడాకారుడు, కథలాపూర్

నిధులు కేటాయించలేదు



ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వారి సూచనల మేరకు మండలస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వాహణకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా బహుమతులు ఇవ్వడానికి దాతలు సహకరిస్తే బాగుంటుంది.
– గౌటి రవీందర్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్

రాజ్యాధికారం దక్కేవరకు ఉద్యమిస్తాం


నినాదాలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): తెలంగాణలో బాంచన్‌గిరి దొర బతుకుల్లో మార్పు కోసమే సబ్బండ ప్రజల చైతన్య వేదిక ఉద్యమిస్తుందని తెలంగాణ గౌడగీత కార్మిక సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం తిరుపతిగౌడ్, తెలంగాణ బహుజన గళం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రజాగాయకుడు లింగంపల్లి నరేశ్ అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ జేఎన్ వెంకట్, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిల్ల రవిగౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ వస్తే అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి జరుగుతుందని తొలి, మలి దశ పోరాటాల్లో ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు, సబ్బండ వర్గాల ప్రజలు ప్రాణాలకు తెగించి కొట్లాడారన్నారు. బలిదానాలతో ఏర్పాడ్డ తెలంగాణలో మళ్లీ బాంచన్ దొర బతుకులతో అణగారిన కులాలను వంచిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారమంటే అగ్రవర్ణాలదే అనే భ్రమను తొలగిస్తూ సబ్బండవర్గాల్లో చైతన్యం వచ్చే వరకు ఈ వేదిక ఉద్యమిస్తుందన్నారు. కాగా అంతకుముందు వేదికపై ప్రజాకవి గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రజాగాయకుడు లింగంపల్లి నరేశ్ బృందం ఆటపాట ఆకట్టుకుంది. సబ్బండ వర్గాల నాయకులు సంగ గంగరాజం, ముద్దం సత్యనారాయణగౌడ్, మరిపెల్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, ముద్దం చంద్రప్రకాష్‌గౌడ్, ముత్యాల చంద్రశేఖర్, తోట లక్ష్మీనారాయణ, కోరుట్ల రాములు, బండారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుల స్వీకరణ


అవార్డు అందుకుంటున్న భూపతిపూర్ సర్పంచ్ చంద్రశేఖర్

రాయికల్/కొండగట్టు/మల్యాల/మెట్‌పల్లిరూరల్/కోరుట్లరూరల్: గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనులు, సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులకు ఎంపిక చేసింది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 రాష్ట్రస్థాయి అవార్డులను జిల్లాలోని పలు గ్రామాలు దక్కించుకున్నాయి. రాయికల్ మండలం భూపతిపూర్, అల్లీపూర్, కొడిమ్యాల మండలం నాచుపెల్లి, మల్యాల మండలం తాటిపల్లి, మెట్‌పల్లి మండలం చింతలపేట, కోరుట్ల రూరల్ మండలం గుంలాపూర్ గ్రామ పంచాయతీలు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డులకు ఎంపిక కాగా బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు జక్కుల చంద్రశేఖర్, అత్తినేని గంగారెడ్డి, అంబాటి లత తిరుమలేశ్, బింగి జ్యోత్స్నవేణు, యాదగిరి అమ్మాయి అవార్డులు స్వీకరించారు. జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశ్విని తదితరులు

జగిత్యాలరూరల్: మహిళ శిశు సంక్షేమ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కె.అశ్విని అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో మహిళ సంఘాల సభ్యులతో మిషన్ శక్తి స్కీం, మహిళ సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు సమస్యలు తలెత్తినప్పుడు 181 సఖీ, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ హెల్ప్‌డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పెన్షన్లు రాకపోయినా, ఇంట్లో పిల్లలు తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా 14567కు ఫోన్ చేయాలన్నారు. వికలాంగులకు పెన్షన్, సదరెం సర్టిఫికెట్లు, ట్రైసైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా 145326 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. బేటి బచావో బేటి పడావో సుకన్య సమృద్ధి యోజన, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్లు హేమశ్రీ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల గురించి తెలుసుకోవాలి

జగిత్యాల: మహిళలు హక్కుల గురించి తెలుసుకోవాలని మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హక్కుల గురించి వివరించారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని, శిశు సంక్షేమ శాఖ ద్వారా అనేక సేవలందించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం అనుపమ, మధులత, అశ్విని, గౌతమి, హేమశ్రీ, నరేశ్ పాల్గొన్నారు.

16న జాబ్‌మేళా

జగిత్యాలటౌన్: ఇంటర్మీడియెట్ ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఉపాధితో పాటు ఉన్నత విద్య అవకాశం కల్పించేందుకు ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 20 ఏళ్ల వయసు కలిగి ఉండి ఎస్సెస్సీలో 60శాతం మార్కులు, ఇంటర్ 55 శాతం మార్కులతో లేదా బైపీసీ లేదా ఒకేషనల్ కోర్సు (బ్రిడ్జి కోర్సు యందు కెమిస్ట్రీ సబ్జెక్టు) ఉత్తర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఒకే ప్రయత్నంలో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని అలాగే ఇంటర్మీడియెట్ 2022–23 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఎంపికైనవారికి రూ.11,000 స్థూల వేతనం, కుటుంబ సభ్యుల కోసం ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ కూడా కంపెనీ వారు కల్పిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం నుంచి ఉచిత ఉన్నత విద్య (బీఎస్సీ కెమిస్ట్రీ)స్పాన్సర్ చేయనున్నట్లు వివరించారు. మొదటి రెండు సంవత్సరాలు సబ్సిడీ, వసతి క్యాంటీన్ సౌకర్యం, ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం జిల్లా కార్యాలయాల సముదాయం రూం నం. 218లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 76600 94470, 80968 88868 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ రవి

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం వెల్లుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రన్నింగ్ అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు కృష్ణవేణి మొదటి స్థానం, శ్రీవల్లి రెండో స్థానం, అండర్–17 విభాగంలో 10వ తరగతి విద్యార్థిని నవనీత రెండో స్థానంలో నిలిచారు. మొదటి రోజు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ నిర్వహించగా రన్నింగ్‌లో సత్తా చాటారు. ఈ నెల 17న జగిత్యాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రవి తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను హెచ్‌ఎం రాంచందర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

'బంగారు' స్వప్నికకు సన్మానం


స్వప్నికను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

కరీంనగర్‌సిటీ: అంతర్జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థిని విరించి స్వప్నికను కళాశాలలో ఘనంగా సత్కరించారు. బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న స్వప్నిక ఆగస్టు 16 నుంచి 21వ తేదీ వరకు షార్జాలో నిర్వహించిన ఆసియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్‌లో 84 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు స్వప్నికను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. అంతర్జాతీయస్థాయిలో కళాశాలకు ఖ్యాతిని తెచ్చిందని తెలిపారు. స్వప్నిక తల్లిదండ్రులు, కళాశాల పీడీ నాగేశ్వరరావు, వ్యక్తిగత కోచ్ రాజేందర్‌ను అభినందించారు. తండ్రి ప్రోత్సాహం, కోచ్ సలహాలతో విజయాలు సాధించానని స్వప్నిక కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హిమబిందు, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఏ. శ్రీనివాస్, జీసీజీటీఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ వి.భిక్షపతి, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎస్. కుమార్, ఉమామహేశ్వరి, డాక్టర్ అర్చన, ఎన్‌సీసీ అధికారి పి.రాజు ఉన్నారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

- మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా గ్రామాల స్థితిగతులు మారుతున్నాయని, అధికారుల సమష్టి కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమం ప్రవేశపెట్టి ప్రతినెలా గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, తద్వారా దేశానికే ఆదర్శవంతమైన గ్రామాలుగా కీర్తి సంపాదిస్తున్నాయన్నారు. 15 గ్రామపంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు రావడం శుభపరిణామమన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నేడు అనుభవిస్తున్నామని, భావితరాల వారికి మంచి వాతావరణం అందించేందుకే అనేక కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. జాతీయస్థాయి అవార్డులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలోనే జిల్లా రెండోస్థానంలో అభివృద్ధి కార్యక్రమంలో నిలవడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ నిధులు కేటాయించడం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పోటీతత్వంతో పనిచేసి భవిష్యత్‌లో జాతీయ అవార్డు సాధించాలన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధులు పోటీతత్వంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా


కొమటికొండాపూర్‌లో ఇసుక డంపు


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గోదావరి పరివాహక గ్రామాలైనా కొమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్ గోదావరి నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ట్రిప్పు ఇసుకకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో అక్రమ రవాణా కొనసాగుతోంది. కొమటికొండాపూర్‌లోని పలు ప్రదేశాల్లో పెద్ద ఎత్తున ఇసుక డంపులను నిల్వ చేశారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీడీసీల వేలం?

మండలంలోని కొమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్ గ్రామాల్లో గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేసేందుకు ఆయా గ్రామాల వీడీసీల ఆధ్వర్యంలో వేలం వేసినట్లు సమాచారం. ఒక్కో ట్రాక్టర్ యజమాని ఇసుక అక్రమంగా రవాణా చేసేందుకు ఏడాదికి మొత్తానికి కొంత డబ్బు వీడీసీలకు చెల్లించినట్లు తెలిసింది.

అక్రమ రవాణాను అరికడుతాం



ఇసుక అక్రమ రవాణాను అరికడుతాం. పోలీసుల సహకారం తీసుకొని ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. డంపులను పట్టుకొని వేలం నిర్వహిస్తాం.
– ప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీల పట్టివేత?

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం మండలం శెకల్ల శివారు, గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లి గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను ఎస్పీ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ విషయంపై బుగ్గారం ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా, ఎస్పీ పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారని, ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి ఆత్మహత్య


మల్లయ్య(ఫైల్)

కరీంనగర్‌రూరల్: తెలంగాణ ఉద్యమంలో పనిచేసినప్పటికీ.. ప్రభుత్వం ఆదుకోవడం లేదంటూ ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కరీంనగర్ మండలం దుబ్బపల్లి గ్రామానికి చెందిన కుక్క మల్లయ్య(58) తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఆ తరువాత ఆర్థికంగా, కుటుంబపరంగా పలు సమస్యలు ఎదుర్కోవడంతో మానసిక ఆవేదనకు గురయ్యాడు. పది రోజుల క్రితం కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పురుగుల మందు తాగాడు. స్థానిక ఆటో డ్రైవర్లు గమనించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఈద శంకర్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, తదితరులు మల్లయ్యను పరామర్శించగా.. తెలంగాణ వచ్చే వరకు కొట్లాడిన తాను ఉద్యమంతో అన్ని విధాల నష్టపోయానని ఎవరూ ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఇతడికి భార్య దేవేంద్ర, కుమారులు సంజీవ్‌కుమార్, సాయిచంద్, కూతురు సారిక ఉన్నారు.

అప్పుల బాధతో బట్టలవ్యాపారి..

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన బట్టల వ్యాపారి బొమ్మిడి రవి (55) అప్పుల బాధతో తన ఇంటి ఆవరణలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రవి కొన్నేళ్లుగా మండల కేంద్రంలో బట్టల షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం రూ.40లక్షల అప్పు చేశాడు. మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొద్దిరోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పులు ఎలా తీర్చాలోనని నిత్యం మదనపడుతున్నాడు. రవి భార్య అన్నపూర్ణ, కుమారుడు అభినయ్ బుధవారం బయటకు వెళ్లారు. కుమార్తె సౌమ్య ఇంట్లోనే ఉంది. రవి ఇంటి బయటికి వెళ్లి చేదబావి దూలానికి చున్నీతో ఉరేసుకున్నాడు. కుమారుడు అభినయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బేతి రాములు తెలిపారు.